

# విలయము

శ్రీ వి. డి. ప్రసాదరావు

★

(సముద్రపు హోరు సన్నగా వినబడుతూంటుంది. మధ్య మధ్య ఒక చిన్న ఉరుము.)

రామదాసు: శ్రీరామ, శ్రీరామ, రామా! రాజీవలోచనా! పుండరీకాక్షా! రామా! ఆహా రామచంద్రా.. ...

(భక్తిపారవశ్యంలో ఉన్న లబ్జలతో అంటూ వుంటాడు.)

పరదేశి: అయ్యా! మూడురోజులనుంచీ మా దంపతులను ఇల్లాగే అట్టే పెట్టి ఉంచారు. ఇవాళైనా యోగిగారి దర్శనం చేసికొని వెళ్లిపోదామనుకొన్నాం. మీరు కటాక్షించరైతిరి. మబ్బులూ ముసురూ అంతకంతకూ ఎక్కువౌతున్నాయి.

రామ: (వినిపించుకోకుండా) రామా! దశరథరామా! జానకిరామ! శ్రీరామ!

పరదేశి: బాబూ, దాసుగారూ!

రాజారావు: హుష్! ఆగవయ్యా పరదేశీ. దాసుగారు భక్తిపారవశ్యంలో ఉన్నారు. ఇప్పుడు వారి ధ్యానానికి భంగం తేకండి.

రామ: ఆహా. ఆహా ధన్యుణ్ణిచేశావా రామా. దర్శనమిచ్చావా? ఓహోహో!

రాజా: (గారంగా) ఏమిటి దాసుగారూ? మాకు కూడా ఆ భాగ్యం కల్పించరూ.

రామ: ఎవరు, రాజారావుగారా? అడుగో, అడుగో. చూడండి. నీలమేఘశ్యాముడు, శ్రీరాముడు. ఎంత ప్రసన్నుడయి కనబడుతున్నాడో. చూడండి చూడండి. ఆహాహా చూడండి. వీరెవరూ, చూడండి బాబూ మీరు చూడండి. అడుగోఅడుగో రాముడు! ఆఁ. ఆఁ! అయ్యో స్వామీ! అంతర్థానమౌతున్నావా!

రాజా: ఔనండీ. ఏదో, లీలగా కనుపించినట్టే అయాడు. అయినా మాబోటి పాపాత్ములకు అంతకన్నా కనబడడేమోలెండి. ఏదో మీ సహవాసభాగ్యంవల్ల ఆ మాత్రమయినా లీలగా కనుపించాడు. మీరు చూడలేదండీ పరదేశిగారూ.

పర: బాబూ! మీ గురువుగారైన యోగిగారి దర్శనమే మాకింతవరకూ లభించలేదు, అల్లాంటి పాపాత్ములకు మాకు భగవంతుడు కనబడతాడా. మా పాపం ఇంకా పండందే. మీకు పుణ్యముంటుంది. ఈనాడైనా మాకు యోగిగారి దర్శనం చేయించండి.

రాజా: పరదేశిగారూ. మీరు పట్టిపిచ్చిని పడిపోతున్నారు. పేరుమాత్రానికి యోగిగారి శిష్యులన్నమాటే కానీండి, మా రామదాసుగారు యోగిగారికన్నా ఎన్నోరెట్లు మహత్త్వం కలవారు. వీరికి శ్రీరామచంద్రుడు ప్రత్యక్షదైవం. కో, అంటే పలుకుతాడు. అంతటివాడిని ఎదుటపెట్టుకొని, యోగిగారో, అంటూ వాపోతారేమండీ?

రామ: (ముసిముసినవ్వులు నవ్వుతూ) నిజానిజాలెల్లా ఉన్నా, మనం, ఆ మాట అనటం అపరాధమే రాజారావుగారూ. మాటవరుసకు చెప్తా. యోగిగారే నాతో ఒకసారి అన్నారుగదా— 'రామదాసూ, నువ్వు నాకన్నా ఎంతో పుణ్యుడవోయి. నీకు రాముడే ప్రత్యక్ష దైవమాయెను. ఎవరి బాధలు నివారణ చేయాలన్నా, ఆ ఆశ్రితజనరక్షకుణ్ణి నువ్వు ఇట్టే తలుస్తే చాలు. నాకో ఇంతవరకూ భగవంతుడు కనిపించనేలేదు. నా కర్మ ఇంకా పండలేదు. నిజానికి నువ్వే గురువ్వి, నేను శిష్యుణ్ణి కావలసింది. అంత గొప్పవాడవుసుమా నువ్వు.' అన్నారు. అంటే నేను అన్నానూ— 'తమ అనుగ్రహం తప్ప అంతమాటా. మీకూ ఎప్పుడో ప్రత్యక్షం కావల్సిందనే నా రాముణ్ణి కోరి గురుకట్నం చెల్లించుకుంటాను' అన్నాను. మనకు, లోకానికి సేవజేయటానికి తప్ప భగవంతుని అనుగ్రహం మనకోసమటండీ! ఏమంటారు?

రాజా: ఆహాహా. రామదాసుగారూ. నిజంగా ఎంత మహాత్ములండీ మీరూ. నా మాట నిజమైంది చూశారా. మహత్త్వంలో యోగిగారూ మీకు చాలరన్నమాటే. చూశారయ్యా పరదేశిగారూ. ఎదురుగుండా ఉన్న నిక్షేపాన్ని వదులుకొంటున్నారు మీరు.

పర: బాబూ నమస్కారం. నేను పామురుడిని. ఏ పుట్టలో ఏ పామున్నదో గ్రహించగల సత్తా నాకెక్కడిది? ఈ సముద్రపు ఒడ్డున యీ యోగిగారి దర్శనం చేసికొంటే సర్వబాధలూ నివారణ ఔతాయని లోకమంతా అంటున్నారు. నా భార్యకు రోగమో, గాలో, పాడో, ఏదో తెలియటంలేదు. పిచ్చవాగుడూ, మంచివాగుడూ కలిసిఉంటాయి. అల్లాగే నీరసించిపోతూంది. ఆ నీరసమ్మీద మొండితనం. రాజవైద్యాలు చేయించాను, భూతవైద్యాలు

చేయించాను. ప్రతి చెట్టుకూ పుట్టకూ మ్రొక్కాను. తీర్థక్షేత్రాలన్నీ తిరిగాను. ఇప్పటికి పదివేలు ఖర్చయాయి. ఇక్కడికి వచ్చాక మూడురోజుల్లో మీ యోగిమందిరంలో బసకూ, చందాలకూ, గుడు పులకూ మామూళ్లకూ, మూడువందలు చెల్లించుకొన్నాను. ఇంకా...

రాజా : (మట అడ్డుతూ) మందిరానికి మూడు వందలిచ్చారా? సరే. సరే. ఇక్కడికి వచ్చే బీదా బిక్కీ అందరికీ సదుపాయాలకోసం ఎవరిసత్తానుబట్టి వారు దైవకార్యానికి ధనం ఇయ్యటంగాని, ఏదో మాకోసం ఖర్చుపెట్టినట్టుగా మీరంటే ఎల్లాగండీ. మిమ్మల్ని ఇయ్యమని ఎవరన్నా నిర్బంధపరిచారా?

పర : నిర్బంధం లేదనుకోండి. కాని ఇయ్యక తప్పనిసరి ఔతూవచ్చింది. అయినా దానికోసం నే ననడం లేదు. ఎన్ని వేలు ఖర్చయినాయిగాదు! నా భార్య మామూలుమనిషిగా అయితే నాకదే పది లక్షలు.

రామ : శ్రీరామ. శ్రీరామ. పరదేశిగారూ మీ భార్యగారికి నయమౌతుందనే నాకు శ్రీరాముడు చెప్తున్నాడు. అయినా మీరు యోగిగార్నే చూడాలనుకొంటున్నారు కాబట్టి, రేపు ప్రొద్దున్న మీకు వారిదర్శనం అయ్యేట్టు ప్రయత్నం చేస్తాను. ఈలోపుగా ఈ రాత్రి మీ ఇద్దరిచేతా ఒక హోమంకూడా చేయించాలి.

పర : అల్లాగే చేస్తాను బాబూ. హోమానికేం కావాలి; ఎంత ఖర్చవుతుంది ?

రామ : మీరేం చెయ్యక్కర్లేదండి. ఊర్కే స్నానాలు చేసి మడిగా తయారయిఉండండి. హోమానికి కావలసినదంతా రాజారావుగారు సమకూర్చిపెడతారు.

రాజా : అల్లాగేనండీ అల్లాగే. ఇంకేం పరదేశిగారూ, మీరు నిశ్చింతగా వెళ్లి మందిరంమేడమీద పడుకోండి.

పర : అయ్యో. ఖర్చులు వారు పెట్టుకోటం ఎందుకండీ.

రామ : (మందహాసంచేస్తూ) అహ్హహ్హా. అల్లా అన్నారూ! మా ఋణాన్న పడిపోవటం ఎందుకంటారు. అదీ నిజమేలేండి. సరే అయితే ఒక వందరూపాయలు వారి కియ్యండి. బహుశా సరిపోవచ్చును. కాకపోయినా ఫర్వాలేదు.

పర : (ఆశ్చర్యంతో) వందరూపాయ లవుతుందండీ !

రామ : (వికటంగా నవ్వి) చూశారా! డబ్బంటే అల్లా ఉంటుంది. అందుకనే మీరు ఇవ్వక్కర్లేదని ముందే చెప్పాను. ఏమంటారు రాజారావుగారూ. (రామదాసు, రాజారావు వికటంగా నవ్వుతారు.)

పరదేశి : అబ్బే అందుకు కాదండి. సరే ఇదిగో వందరూపాయలూ తీసికోండి. రేపు యోగిగారి దర్శనానికికూడా సెలవిప్పించండి. నమస్కారం వెళ్లివస్తా. (నిష్క్రమణము.)

రామ : శ్రీరామ. సుఖంగా వెళ్లిరండి.

రాజా : శహబాస్ దాసుగారు. ఇదిగో మీ సగం ఏభై రూపాయిలూ మీదగ్గిర ఉంచండి.

రామ : ఏదో భగవత్కృప ఎంతకు అంతే చూడండి. రామచంద్రపాహి.

(ఉరుములు ఇందాకటికన్నా కొంచెం ఎక్కువగా వినబడ్తాయి. గాలి జోరౌతుంది.

రామ : ముసురు బాగా పట్టిందే.

రాజా : బాగానే పట్టింది. పొద్దు తెలీటంలేదు.

(సంగి చీపురుతో ఊడుస్తూ ప్రవేశం)

సంగి : ఏమయ్యోయ్ గడ్డపాయనా, కాసింత ఒత్తిగిలండి ఊడుస్తా.

రామ : (కోపంతో) ఆ. ఏమన్నావ్. నీకు గడ్డపాయనా. (హుంకరిస్తాడు)

రాజా : ఏయ్ సంగీ, నీకు మరీ ఒళ్లూపై తెలియకుండా పోతోంది. ఇంత పొద్దెక్కాక ఇప్పుడు చీపురుచ్చుకొని తయారయి చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా, ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతావ్! ఆఁ!

సంగి : ఏమిటయ్యోయ్! తప్పకోమంటే తప్పకోక ఇద్దరూ రంకె లేస్తారు. గడ్డముంటే గడ్డపాయనకాదా? పొద్దెక్కిందట పొద్దు, చాలుచాలు, ఆబొంత తియ్యవయ్యోయ్ గడ్డపాయనా, బాసింపట్టేసుకొని కూర్చున్నావు గాని లేలే.

రామ : (ఉగ్రంగా) నిన్నేం చేస్తానో చూడు. భ్రష్టాకారి...

(నారాయణవెంట కుయ్ మంటూ కుక్క)

నారాయణ : ఏమిటి సంగీ. అప్పుడే రామద సమహర్షి గారికి కోపం తెప్పించావ్. నమస్కారం మహర్షిగారూ, ఇవాళ మా కుక్కకు పాపాలు పోగొట్టడానికి మీదర్శనానికి తీసుకువచ్చాను. ఒరేయ్ భైరవా, మీ బాబుగారికి నమస్కారం చెయ్యరా. (కుక్కను బొంతమీదికి తోస్తాడు. కుక్క కుయ్ కుయ్ మంటూ ఉంటుంది. ఛీ ఛీ ఛీ అంటూ రామదాసు అడావుడిగా లేస్తాడు.)

సంగి : (పకపకనవ్వుతూ) భలే భలే, గడ్డపాయన బొంతతో కూడా ఇట్టే లేచాడు (పకపక నవ్వుతుంది)

(ఉరుముల శబ్దం కొద్ది కొద్దిగా ఎక్కువౌతూంటుంది.)

రామ : (ఉగ్రంగా) మీ ఇద్దరి పనీ మహా ఇదిగా ఉంది. మీ రోగం కుదురుస్తాను. మిమ్మల్ని భస్మీపటలం చేస్తాను.

రాజా : ఎంత ఆగడం. యోగిగారికి మంచిచెడ్డలు ఏమీ తెలియవు. భ్రష్టాకారులూ, లుచ్చాలూ, ఎల్లాంటి పరమపాపులు చేరినా కిమ్మనడు. ఆ అలుసు చూసుకొని వీళ్లు మరీ పేట్రేగిపోతున్నారు.

రామ : (కోపంతో) పేట్రేగుతారు, పేట్రేగుతారు చూస్తానుగా!

నారా : (నవ్వుతూ) శాంతం. శాంతం. దాసుగారూ. అయినా మిమ్మల్ని గడ్డంపెంచవద్దని ఎంత బతిమాలాను. బతిమాలానా లేదా చెప్పండి? గడ్డాలు పెంచితే ఋషులకులాగా కోపాలూ, శాపాలూ అలవాటౌతాయండీ—రాజారావుగారూ, మీరు ఒక్కటిమాత్రం నిజంచెప్పారు. ఈ యోగిగారి అసలుసంగతి ఏమోగాని, వారి చుట్టూమాత్రం పరమలుచ్చాలూ, ఆషాఢభూతులూ చేరినమాట వాస్తవం! ఏమంటారు ?

రాజా : అబ్బాయి నారయణా! మంచీ, చెడ్డా, పిన్నా పెద్దా కాస్త తెలుసుకొని నడుచుకో. మరీ అంత మిడిసిపడకు.

నారా : రామరామ. నాకెందుకండీ మిడిసిపాటు? యోగివర్యులకి ప్రథమశిష్యులూ, ఆయన్ని మించిపోయిన దైవభక్తులూ మీరంతా ఉండగా—ఎంతటి భక్తులు కాకపోతే, యోగిగారి పేరిట మీ కింతంత ధనరాసులు చేరుతాయి?

రామ : (ఛీత్కారంగా) ఛీ. ఛీ. ఈ బొంతా కౌపీనం, తప్ప నాదగ్గర డబ్బుందట, లుచ్చా అని—లుచ్చామాటలూ! చూడండి రాజారావుగారూ! నన్నెంత మాటంటున్నాడో ఈ నారిగాడు.

నారా : అయ్యో నారాయణా అనటం అలవాటుచేసుకోండి. అజామిళుడికిలాగా మోక్షమన్నా వస్తుంది. అంతగా జ్ఞాపకం రాకపోతే, ఒక్క నారపాయా, ఒకఅణా మెళ్ళో కట్టుకోండి. అప్పటికీ పీచుపీచు అనేరు జాగ్రత్త!

సంగి : (పకపక నవ్వుతూ) సరేలెండి. లెండయ్యో, ఈ ముంగిలి కాస్తా ఊడ్చి ఉన్నవారందరికీ ఫలారాలు ఇచ్చి తమ దగ్గరకు తీసుకురమ్మన్నారు యోగిబాబు. ఇప్పటికే వేళయింది. లెండి.

రామ : (కోపంతో దీర్ఘాలుతీస్తూ ఆక్షేపణతో) యోగిగారి దర్శనం చేయించటానికి నీకన్నా పవిత్రులు యోగిగార్కి దొరకలేదేం? మేమంతా మట్టిగొట్టుకుపోయామట! నానాతిరుగుళ్లూ తిరిగి, ఎందరికొంపలో తీసి, వృద్ధనారీ పతివ్రతా అని, భక్తురాలివై ఇక్కడచేరి, యోగిగారికి మహాఅంతరంగికురాల నన్నట్లు నటిస్తున్నావ్! నోరు మూసుకొని అవతలికి కదులు. నీచేతి ఫలారాలు కూడా తింటాడూ? మర్యాదఉన్నవా డెవడైనా? ఆ భ్రష్టత్వం కూడా కావాలా? చాల్చాలు నడు.

సంగి : ఏమయ్యోయ్ గడ్డపాయనా! మాటలు సరిగా రానియ్యి. నే చెడ్డదాన్నే కావచ్చును. ఒకళ్లవల్ల నేను చెడ్డాను గాని, నేను ఎవరికీ చెరుపు వెయ్యలేదు. అయినా, నేనేమీ నీకులాగా పవిత్రురాలి నని చెప్పకోటంలేదు. ఎన్ని ఘాతకాలు చేసి, ఇక్కడికి వచ్చి, ఆ బాబుపేరిట ఎంత సొమ్ము గడిస్తున్నావో, అంతా నా కెందుకని ఊరుకొంటున్నా కానీ, నీ బండారం బైటపెట్టాలంటే నిమిషం పట్టదు.

రామ : (హుంకారము) ఇప్పుడే యోగిగారితో చెప్పి నీపని పట్టిస్తా నుండు. హుం!

(సముద్రపు హోరూ, గాలిహోరూ ఇంకొంచెం ఎక్కువౌతుంది.)

సంగి : ఈ గుమ్మంలోంచి ఇప్పుడు లోపలికి వెళ్లటానికి వీల్లేదు. కదిత్తే మాట దక్కదు. యోగిబాబు ధ్యానంలో ఉన్నారు. ఆయనధ్యానం చెడగొట్టేందుకు ఇక్కడచేసిన అల్లరి చాలు. అవతలికి నడవండి ముందు! (ఉరుముల శబ్దం కొంచెం తగ్గుతుంది. గాలి హోరు హెచ్చుతుంది.)

నారా : హుష్, హుష్. సంగమ్మా! వారు మహాఋషులు. వారికి కోపం వస్తే నువ్వూ నేనూ, యోగిగారూ అందరం భస్మం అయిపోతాం. అప్పుడే చూడూ, ఆకాశం అంతా ఉరుములు ఎల్లా తెప్పించేశారో చూడు! ఇక వారు తలచుకొంటే ఉప్పెనే. వద్దు బాబూ, వద్దు శాంతించండి! రామదాసుగారూ, సంగిలాంటి నీచపు మనిషితో మీలాంటి మహాత్ముల కేమిటి చెప్పండి? అయినా మీ అంతివారు మీరు. మళ్లీ, ఆయన యెవరో యోగితో పితూరీలా? శాంతించండి. సంగమ్మా ముందు అందరికీ ఫలారాలు తీసుకురా పో.

రామ : (కోపంతో) హు! చాలులే నోర్ముయ్! తిరుగుబోతుగాడిదవి. నీ బతుక్కు నువ్వూ మధ్యవర్తిలా వచ్చి అవాకులూ చెవాకులూ వాగాలట.

నారా : అయ్యరెయ్యో. నేనేమన్నానండి. ఇంకా నా కుక్కసాక్ష్యం. ఏమంటావే చెప్పవే. (కుక్క కుయ్ కుయ్ మంటుంది.) పోనీ అంతకన్నా ఘరానాసాక్ష్యం రాజారావుగా రున్నారు. గురుదర్శనంకోసం వచ్చే యాత్రికులకు మందిరాలూ, హోటళ్లూ కట్టించి, కాంట్రాక్టుల్లోనే కైంకర్యంచేసిన ఘరానామనిషి ఆయన. ఇప్పటికీ గురువుగారి పేరిట పచ్చకాగితాలు చూస్తూనేఉంటాడు. ఏమంటారు రాజారావుగారూ?

రాజా : నీతో మాట్లాడటంకన్నా ఆ కుక్కతో మాట్లాడటం నయం. రండి రామదాసుగారూ, మందిరానికి పోయి, తర్వాత మళ్లీ వద్దాం.

రామ : ఛీ, ఛీ, ఛీ, నా శాంతం అంతా పాడు చేశారు ఈ దగుల్బాజీలు. పదండి పోదాం, మనస్సు శాంతిపడ్డాక మళ్లీ రావచ్చు.

(ఇద్దరూ వెళ్తారు.)

నారా : అయ్యయ్యో, ఫలహారాలు పుచ్చుకోకుండా వెళ్లకండి. (నవ్వుతూ) పోయా రిద్దరూ! పోనీలే సంగమ్మా! నా కుక్కకు పెడుదువుగానిలే.

సంగి : అదే కొంత నయం, ఈ లుచ్ఛాల కన్నా.

నారా. సంగమ్మా కుక్కకు కాస్త పాలు పోస్తూ ఉండు. నేను లోపలికి వెళ్లి యోగిబాబును చూసివస్తా. (లోపలికి కెళ్తాడు)

(కుక్క కుయ్ కుయ్ మంటూ మూల్గుతుంది)

సంగి. ఇదుగో, ఈ పాలు తాగవే. తాగమ్మా తాగూ. దూ! దూ!

(కుక్క మోర ఎత్తి పెద్ద ఏడుపు ఏడుస్తుంది. గొలుసు తెంపుకుపారిపోతుంద)

సంగి : అయ్యయ్యో, ఇదేమిటి పారిపోతూంది. నారాయణా, నీ కుక్క పారిపోతూంది. పాలు వాసన అన్నా చూడలేదు.

నారా : (లోపల్నుంచి ప్రవేశించి తొందరగా) సంగమ్మా బాబు లోపలికి అర్జెంటుగా పిలుస్తున్నారు. కుక్క పారిపోయిందా. ఆఁ, ఎక్కడికి పోతుందిలే. తర్వాత చూద్దాం. పద, నన్ను వెళ్లి ఇక్కడున్న యాత్రికులందరినీ ఒకసారి ఇప్పుడే పిలుచుకు రమ్మన్నారు. నేను వెళ్లి వస్తాను, నువ్వు లోపలికిపో. (సంగి లోపలికి వెళ్తుంది)

పరదేశి : భార్య కేకలు వేస్తూ, పరదేశి సముదాయిస్తూ ప్రవేశం)

పర : పడిపోతావే. ఇల్లా రాకూడదు. ఏమిటా కేకలూ! యోగిగారిని తెగబడి చూడకూడదే! రామదాసుగారూ వారు పర్మిషన్ ఇవ్వాలి. లేకపోతే మనకు వికటిస్తుంది.

భార్య : అంత పర్మిషన్ ఉన్నయోగిని చూడనే అక్కర్లేదు.

నారా : నిజమమ్మా. ఆ మాట నిజం?

భార్య : ఏయ్? ఎవరయ్యా నువ్వు, నన్ను యోగిగార్ని చూడనియ్యనిది నువ్వేనా.

నారా : యోగిగార్ని ఒకళ్లు చూడనియ్యకపోవట మేమిటమ్మా, పద. లోపలికి పోయి నీ అంతట నువ్వే నమస్కారం చెయ్యవచ్చు.

భార్య : ఏమిటీ. మరింత తేలికగా చూడగల్గితే మా ఆయన ఇన్నాళ్లూ ఆ మాలకూడుమఠంలో పడేసి చంపా రెందుకూ నన్ను, ఇంతకూ ఈయనలో ఏమన్నా మహత్యం ఉందా. నా జబ్బు నయం చేస్తాడా?

నారా : (నవ్వి) ఆయన ఎవళ్ళజబ్బూ నయం చేస్తానని చెప్పడమ్మా. అదంతా మీ నమ్మకంలోనే ఉంటుంది.

(35 వ పేజీ చూడుడు)

# ప్రళయం

(24 వ పేజీ తరువాయి)

భార్య : ఏడిసినట్టే ఉంది! ఇంత ఖర్చుపెట్టించి, తీరా కుదరకపోతే, మీకు నమ్మకం చాలదని ఇదో పైమాటా? పదండి తిరిగిపోదాం. యోగీ అక్కర్లేదు—జోగీ అక్కర్లేదు. ఏమండోయ్ ఈ క్షణాన్ని నన్ను ఇక్కడినుంచి ఇంటికి తీసుకుపోతారా, పోరా?

పర : సరే అల్లాగే చూసివెళ్లి పోదాంలేవే. బాబూ మీ రేమనకోకండి. దానికి రోగంతో మనస్సు చలించి ఇల్లా తిక్కగా పిచ్చిమాట లాడుతూంటుంది. పోనీ, ఎల్లాగో మీరైనా యోగిగారి దగ్గిరకు మమ్మల్ని తీసికెళ్లండి.

నారా : పరదేశిగారూ. మీరు రామదాసుఇంద్రజాలంలో పడిపోయారు గాని, ఈయన్ని చూసేందుకు ఒక అంతు, అజ్ఞ, పుర మాయింపూ ఏమీ అక్కరలేదు. మీరే స్వయంగా లోపలికి వెళ్లి చూసిరండి.

పర : (సంతోషంతో) వెళ్లవచ్చునంటారా! సరేలే రావే. లోపలికి రావే.

భార్య : నేను రాను. నన్ని పళాన ఇంటికి తీసుకుపోవలసిందే.

పర : అయ్యోరామా. ఇదెక్కడి ఖర్మమే. ఈయన్ని చూడటానికి అనివచ్చి ఇప్పుడింత మొండిపట్టు. అయినా గాలీ వానా ఇల్లా ఉండగా ఇప్పుడెల్లా వెళ్ళేది. కొస్త తగ్గాక వెళ్దాం.

(సంగి ఆదుర్దాగా లోపలినుంచి ప్రవేశించి)

సంగి : నారాయణా! ఇంకా ఇక్కడే ఉన్నావా! ఇప్పుడు గురువుగారి దర్శనం చేసుకొనేందుకు ఎవళ్ళకీ వీలుండదట. ప్రాణాల మీద ఆశ ఉన్నవాళ్లు ఎవళ్లూ ఈ పరిసరాలలో ఉండకుండా వెంటనే పట్టణానికి పారిపొమ్మన్నారు.

పర : ఆఁ. ఆఁ. ఏమిటి విశేషం?

భార్య : ఏమిటే. ఇంతకూ నన్ను చూడనంటాడా, మీ యోగిగారు ? (వెర్రి నవ్వు నవ్వుతూ) నా రోగం కుదర్చలేనని ఒప్పుకొన్నాడన్నమాట. మరి మమ్మల్ని ఇంత యాతన ఎందుకు పెట్టాడో చూసి కనుక్కొంటేనేగాని నేను కదలను.

సంగి : అయ్యో పిచ్చిగొడవ. పద నారాయణా! ముందు మందిరంలోనూ అంతటా అందరికి చెప్పు. పద! ఈ సముద్రతీరాన్ని ఒక్క పురుగైనా నిలవనీకుండా వెంటనే పంపించెయ్యమని బాబు చెప్పాడు.

నారా : అయితే ఏదో ప్రళయ ముందన్నమాటే. ఇది మళ్లీ ఉప్పెన తెస్తుందేమో !

పర : ఆఁ. ఆఁ. ఉప్పెన వస్తుందా. అయ్యో. అయ్యో. ఇంటికైనా చేరేంగాదు. ఇప్పుడేంగతి! ఒసేవ్ పదవే ముందు.

భార్య : ఉప్పెన ఎల్లా ఉంటుందో చూడాలి. నే నిక్కడే ఉంటాను.

నారా : అదికాదమ్మా.

సంగి : ఏమిటి నారాయణా. ముందుపదా. అక్కడ అందరికి చెప్పివద్దాం. ఏమయ్యోయ్ నీ భార్యను బలవంతంగా బుజాన్నేసుకునైనా ముందు ఇక్కడనుంచి పారిపో. దా. నారాయణా పోదాం. చెప్పివద్దాం.

(ఇద్దరూ వెళ్తారు. ఉరుములూ, గాలిహోరూ ఎక్కువౌతాయి.)

పర : హుహు. భయమో చలో కూడా తెలియటంలేదు. రావే పోదాం. ఇక్కడుంటే ప్రాణాలు నిలవ్వు.

భార్య : మరి యోగిగార్ని చూద్దామనరూ !

పర : చస్తూంటే సంధిమంత్రంలాగుంది, పోనీ చూద్దాం ఆగు అప్పటికైనా తెములుతావేమో.

పర : (తడికకొట్టి) గురూ. యోగిగారూ. లోపలికి రమ్మని సెలవా! (నిశ్శబ్దం)

భార్య : అడిగేదేమిటి లోపలికి పోక? ఏమి టింత చీకటిగా ఉందే!

పర హుష్. వెనక్కి రావే. (భార్యను బరాబరా వెనక్కు లాగుతాడు) అక్కడ మన కేమీ కనబడదు. ఆయన ధ్యానంలో ఉన్నారుగామాలు. మాటాడటంలేదు. ధ్యానానికి భంగం కల్గిస్తే ఏమవుతుందో. పద ముందు ఇంటికి పోదాం. తర్వాత మళ్ళీవచ్చి దర్శనం చేసుకోవచ్చు.

(రామదాసు, రాజారావు ప్రవేశం)

రామ : ఏరీ. యోగిగారి నడుగుతాను? ఇంత హంగామా చేస్తాడా. ఇక్కడ సముద్రం పొంగి ఇక్కడివాళ్లంతా చచ్చిపోతామని ఈ నారిగాడికి సంగికి యోగిగారు చెప్పారా? నా బొంతా నేనూ మునిగిపోతామా?

రాజా : నా మేడ, నేను కట్టిన మందిరము అన్నీ కుప్పగా కూలిపోతాయని అన్నాడా యోగిగారూ ? ఏమండీ పరదేశిగారూ మీరు ఇక్కడే ఉన్నారే? యోగిగారు అనగా మీరు విన్నారా?

భార్య : వీళ్లెవళ్లు? వీళ్లేనా మన కిన్నాళ్లూ దర్శన విప్పించనిది? చూశారా అని అడుగుతారేం? తమ కేం తెలియనట్టు. ఎవర్నయ్యా చూసేది? ఎవరూ లేకుండా చీకటి గుహపెట్టి తతంగం ఆడి మా డబ్బంతా లాక్కున్నారూ?

రామ : ఆగవమ్మా, ఆగు. మీ డబ్బుసంగతి తర్వాత చూద్దాం. ముందు యోగిగార్ని కలవాలి.

పర . ఆయన లోపల ఆ చీకటిలో కదలకుండా మెదలకుండా కూర్చున్నారండి. ధ్యాననిష్టలో ఉన్నట్లున్నారు.

రామ : ఈ నిష్ఠలన్నీ నా దగ్గర కాదు. తక్కినవాళ్లకు చూపించనీ! రండి రాజారావుగారూ. కనుక్కుందాం. (లోపలికి వెళ్లి) గురూ, మా ప్రశ్నకు జవాబు చెప్పాలి. (ఫెళఫెళా పిడుగు చప్పుడు గాలిహోరు సముద్రంహోరు మరింత ఎక్కువవుతుంది.)

రామ : చచ్చాను బాబోయ్. నిజమేలాగుంది. ఆయన కదలకుండా కూర్చున్నాడు. నే నింటికి పోతాను. ఆగు రాజారావు. ఏమి టీ పట్టుకోటం. నా బొంత వదులు.

రాజా : (ఏడుస్తూ) రామదాసూ! నాడబ్బంతా నాశనమేనా? ఈ కట్టినవన్నీ కూలిపోవలసిందేనా ? అయ్యయ్యో. వీటికోసం ఎన్నిపాపాలు చేశాను. చివరకుమిగిలేది చేతికిచిప్పేనా (ఏడుస్తాడు.)

ప. భార్య : (వికటంగా నవ్వుతూ) ఇక్కడుంటే ఆ చిప్ప పట్టుకొనే ప్రాణీ మిగలదట.

పర : (ఆదుర్దాగా) రావే పోదాం. వీళ్ల జోలి ఎందుకు ?

రామ : రాజారావూ వదులూ. నీ కర్మ నీది. నా కర్మ నాది. నే పోతాను.

రాజా : (ఏడుపులో కోపంతో) ఆ బొంతలో డబ్బులో సగం నాకు ఇస్తేనేగాని నిన్ను వదలను. నేను చిల్లిగవ్వ రొఖ్ఖంగా మిగుల్చుకోలేదు. అంతా ఇక్కడి ఇళ్లకు పెట్టాను. డబ్బంతా నువ్వు మిగుల్చుకున్నావు.

రామ : (కోపంతో విదిలించుకుంటూ) వదుల్తావా వదలవా? నీ బ్రతుకు నీది. నా బ్రతుకు నాది. నా పెళ్లాంబిడ్డలకూ, నాకూ, అక్కరలేదా?

పరదేశి : ఏమిటి! రామంమా! ఇంతటి లుచ్చాలా వీరిద్దరూ? నా మూడువందలూ కూడా కాజేశారా.

రాజారావ్ : నాకు తెలియదు. వాడే తీసుకొన్నాడు.

(ఒక్క విసురుగాలితో కెరటం హోరుతో విసురుతుంది.)

రామ : ఈ పందిరివాసం విరిగి నెత్తిమీద పడింది. పరుగెత్తండ్రోయ్, పరుగెత్తండి.

రాజారావ్ : బాబోయ్. (అంటూ పారిపోతాడు.)

సంగి : (ప్రవేశించి) ఇంకా ఇక్కడున్నా వేమయ్యా. ముందు పారిపోండి. అప్పుడే ఊరిదోవలో ఉప్పుకయ్య నిలువులోతు దాటి నేల నిండుతోంది. ఇప్పుడే పారిపోండి.

పరదేశి : ఇది కాదు మార్గం. దీన్ని కావలేసుకొని ఎత్తుకెళ్తాను. (భార్య నేను రాను, నేను రాను అని యాగీ చేస్తూంటుంది. (లాక్కుపోతూంటాడు)

నారా : (ప్రవేశం.) ఉష్. అబ్బా. ఒక్క క్షణం ఆలస్యమయితే అవతలికి జేర్చలేకపోయేవాడిని, సంగమ్మా పందిరి కూలిపోయినట్టుంది. పాక ఎల్లా ఉంది? యోగిబాబును మందిరం మేడలోకి తీసుకెళ్దామా ?

సంగి : నారాయణా! మళ్లీ వెనక్కి వచ్చావేం, అటు ఊళ్ళోకి వెళ్లిపోక? నువ్వు తీసికెళ్లిన వందమంది కయ్య దాటారా ?

నారా : నువ్వూ ముందర కొందర్ని పంపించినదానవు మళ్లీ వెనక్కు వచ్చావెందుకూ ?

సంగి : బాగానే ఉందిలే సరసం? అందరూ కయ్య అవతలికి పోయినట్లేనా ?

నారా : ఇంకా తండోపతండాలుగా వెళ్తున్నారు. రామదాసూ రాజారావూ ఒకళ్ల జుట్టు ఒకళ్లు పట్టుకొని కొట్లాడుకొంటూ ఒక అడుగు ముందుకూ ఒక అడుగు వెనక్కూ వేస్తున్నారు. ఆ పరదేశి స్పృహ లేకుండా ఉన్నాడు. పెళ్లాం నడిపించుకుంటూ తీసికెడుతోంది. (వణుకుతో) వీళ్లెవళ్లూ అట్టేదూరం వెళ్లి ఉండరు. ఉహూహూ అబ్బా, ఈ గాలి ఎదుర్రొమ్మును విరగ్గొట్టేస్తోంది. సంగమ్మా, బాబుగారెల్లా ఉన్నారు ?

సంగి : నే నింకా చూడలేదు. ఇదిగో (ఓ, ఓ అని కేకలేస్తుంటే)

(సముద్రము పెద్ద హోరుతో పెద్ద అల ముంచెత్తివస్తుంది. తుపానుహోరు పెద్ద కెరటం విరిగిన హోరూ ముంచెత్తుతుంది.)

నారా : (బుడ బుడ చీదరించుకుంటూ, గాలి వదల్తూ నీళ్లల్లో ఈదుతున్న చప్పుడు చేస్తూ కష్టంమీద కేక లేసినట్లు) సంగమ్మా! భ్రూ! భ్రూ! భ్రూ సం—సంగీ (ఈతకొట్టున్నట్లు కాళ్లూ చేతులు చప్పుడు చేస్తూ)

సంగి : (నోటిలోని నీరు బుడబుడా ఉమ్మేసి) హు హూ. నారాయణా.

నారా : ఆ గడ పుచ్చుకో. ఆ కనపడే దిబ్బమీదికి ఈదుకు పోదాం.

సంగి : నీరు వెనక్కు లాగేస్తూంది. నువ్వు పో. నన్ను వదిలేయ్.

(కాళ్లూ చేతులూ తపతప లాడిస్తుంది)

నారా : ఆగు. ఈ గడ పుచ్చుకో. ఇదిగో తిప్ప అందింది. కాలూని నిలోచ్చ.

సంగి : అమ్మయ్య, కాలూనింది. దిబ్బపై కెక్కు.

(భూకంపమంతటి పెద్ద శబ్దాలతో దడదడలాడే పెద్ద చప్పళ్లతో మందిరాలన్నీ కూలిపోయినచప్పుడు)

నారా : ఆఁ! ఆఁ! మందిరం కూలిపోయింది.

సంగి : నారాయణా, చుట్టూ సముద్రం తప్ప ఏమీ కనపడ్డంలేదు. గురువు ఏరీ? పాక ఎక్కడికో కొట్టుకుపోయింది. గురూ, గురూ! (ఏడుస్తుంది)

నారా. అబ్బా. ఎన్ని శవాలు వెనక్కు కొట్టుకొస్తున్నాయేం! అబ్బా! ఎంత భీకరంగా ఉందో! సంగమ్మా, ఆమని వరో కదులుతున్నాడు. ఇక్కడ నిలోచ్చ. ఆ గడ ఇల్లా తే. పోయి ఈదుకు లాక్కొస్తాను. (ఈదుతో లోపలికి పోయినచప్పుడు.)

సంగి : నారాయణా! నారాయణా! ఆ మనిషిని వదిలెయ్యి. ఇల్లా రా. ఆ గడిల్లా తే. (బుడుంగు బుడుంగు మని చప్పుళ్లు.)

నారా : సంగమ్మా అటు పట్టుకో దిబ్బమీదికి లాగు. ఎవరూ. రామదాసే. ఇదేమిటి రాజారావుకూడా.

సంగి : (నిట్టూర్చి) ఆ బొంతకోసం ఇద్దరూ పెనగులాడి అల్లాగే ప్రాణాలు వదిలారు.

నారా : చచ్చిపోయారా? ఇంత బరువుందేమిటి? బొంతలో ఏముంది?

సంగి : రామదాసుసంపాదించిన రూపాయలు అందులోనే ఉన్నాయి. ఆ బరువుకే ఇద్దరూ చచ్చారుగావును—

(అయ్యో, రక్షించండి మునిగిపోతున్నాం బాబోయ్! అని స్త్రీ కంఠం.)

సంగి : ఆ ఏడుపు ఎక్కడిదో చూద్దాం పద.

(ఈదుకొంటూ పోతారు. మళ్లీ ఒక పెద్దకెరటం విరిగిన చప్పుడు. సంగీ, నారాయణా అన్నవాళ్లిద్దరి కేకలూ సన్నగా వినపడుతుంటాయి.)

(ఒక్కసారి సముద్రంహోరు; సన్నగిలిపోతుంది.)

పరదేశిభార్య పరదేశి : బాబూ కొట్టుకు పోతున్నాం. గడ పట్టుకూడా తప్పిపోతూంది. అయ్యో, రామా రామా.

ఒకకంఠం : భయంలేదు. కొంచెం ఓపికతో ఈగడ గట్టిగా పట్టుకోండి. నేను పైకి లాగుతున్నాను. రండి. నేలఅందిందా? నెమ్మదిగా రండి.

భార్య : అయ్యో! ఈయన కూలిపోతున్నారు. బాబూ దయాళూ, ఎవరో ఇంకొంచెం దూరంగా లాగండి.

కంఠం : ఫరవాలేదమ్మా. ఇదుగో దిబ్బమీదికి వచ్చేశారు. కూర్చొని సేదతీర్చుకోండి. మీ కేం ఫరవాలేదు.

భార్య : (ఏడుస్తూ) ఏమండీ. ఏమండోయ్.

పర : (నీళ్లు డొక్కని తేరుకొనిలేచి) ఆఁ! ఆఁ! ఎక్కడ ఉన్నాం? నేలమీదే ఉన్నామూ! ఎవరు బాబూ మమ్మ రక్షించిన దైవం?

భార్య: ఇదుగో వీరు. బాబూ, మీ పాదాలకు మొక్కుతాం! మీ ఋణం తీర్చుకోలేం! మీ పేరేమిటి బాబూ?

కంఠం: ఋణమేమీ లేదమ్మా. నాపేరు లచ్చన్న. (దూరాన మళ్లీ రక్షించండోయ్ అని చావుకేక) ఇక్కడే నిలవండమ్మా. ఫరవాలేదు. నేను ఇప్పుడే వస్తాను. (నీళ్లను తోసుకొంటూ పోతున్న చప్పుడు)

భార్య: అరెరె! నీళ్లమీదే నడిచిపోతున్నట్లున్నాడు!

(సంగీ, నారాయణ చెరోవైపునించీ ఈదుకుంటూవచ్చి దిబ్బ మీదకి చేరుతారు)

సంగి: (నవ్వుతూ) నారాయణా! మళ్లీ ఎల్లాగో బతికాం.

నారా: సంగమ్మా బతికేఉన్నావా? బాబు కనపడ్డాడా? ఇదుగో పరదేశీ-భార్యా. ఎల్లా బ్రతికారో! ఈ విడిప్పుడు బాగా తెలివిగానే ఉందే.

భార్య: ఔనాను బాబూ, మొదటి కెరటంతోనే నా రోగాలన్నీ పోయాయి. మా ఆయనకన్నా, ఇప్పుడు నేనే ఆరోగ్యంగా ఉన్నాను. మిమ్మల్నీ ఆ మనిషే ఇక్కడికి చేర్చాడా బాబూ?

సంగి: ఏమనిషీ?

పరదేశీ: ఆయనపేరు లచ్చన్నట. మమ్మల్నిద్దరినీ కొనప్రాణంతో ఉండగా ఇక్కడ చేర్చాడు. ఇంకా ఎవర్నో బ్రతికించాలని నీటికెదురుగా నీటిమీద నడుస్తున్నట్లే వెళ్లిపోయాడు.

సంగి—నా: (సంతోషంతో) గురువుగారు బ్రతికేఉన్నారు. గురూ నమస్తే! ఆయనేనయ్యా మీరు చూద్దామనుకొన్న యోగిగారు!

భార్య: ఆఁ. ఆఁ. నిజంగానా!



జీవిత పద్మవ్యూహము
శ్రీ మా. గోఖ్లే.



ప్రజకిశోర్
శ్రీ టి. వి. రత్నం.

స్వీకారము:

అఖిలిండియా ఖాదీ స్వదేశీ పారిశ్రామిక ప్రదర్శనంలో (తమిళనాడు కాంగ్రెస్ యాజమాన్యంలో జరిగింది) చిత్రకళాశాఖకు సంబంధించి ప్రకటించిన ఆర్టుగాలరీ అన్న పుస్తకము మా కార్యాలయమునకు అందినది. చిత్రకళకు సంబంధించిన ముఖ్య వ్యాసములను ఈ ప్రదర్శనములోని, సుప్రసిద్ధ చిత్రకారుల చిత్రములను, ఈ పుస్తకములో ప్రకటించారు. పుస్తకము వెల రూపాయి. చిత్రములు బాగున్నవి. వీనిలో రెండు చిత్రములను ప్రకాశకుల సౌజన్యముతో ఇట పొందుపరుస్తున్నాము.